క్లుప్తంగా

పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోండి



గుడిబండలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

రొళ్ల: గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి మరింత జ్ఞానాన్ని పెంచుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయశాఖ సంస్థ కార్యదర్శి పి.రమ సూచించారు. బుధవారం స్థానిక గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రమ మాట్లాడుతు అన్ని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం నిబంధనల మేరకు 8 శాతం గ్రంథాలయ పన్ను చెల్లించాల్సి ఉందన్నారు.

గుడిబండ: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పనితీరు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, సౌకర్యాలపై పాఠకులతో ఆరా తీశారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు కృషి చేయాలని గ్రంథాలయ అధికారి ఇబ్రహీంకు సూచించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: సమాచార హక్కు చట్టం ప్రజలకు బ్రహ్మాస్త్రం లాంటిదని జిల్లా సహకార అధికారి ఆర్ కృష్ణానాయక్ తెలిపారు. బుధవారం స్థానిక వాసవి ధర్మశాల రోడ్డులోని హిందూపురం డివిజనల్ సహకార అధికారి కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. పీఐఓ రాగసుధా, సూపరింటెండెంట్ మహేష్‌కుమార్, ఏపీఐఓపీ హెచ్.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంటు ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు పట్టణంలోని ఐడీబీఐ బ్యాంకు ప్రతినిధులు సీఎస్ఆర్ నిధులతో ఆర్‌ఓ ప్లాంట్, ఫర్నీచర్‌ను బుధవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం, ఐడీబీఐ బ్యాంక్ అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ రాజేష్ కుమార్, హిందూపురం బ్రాంచ్ ఇన్‌చార్జ్ మహేష్ రిబ్బన్ కట్ చేసి ప్లాంట్‌ను ప్రారంభించారు.

పాత పోస్టాఫీస్ ప్రాంతంలో అంధకారం



అంధకారం నెలకొన్న పాత పోస్టాఫీస్ ప్రాంతం

పెనుకొండ: పట్టణంలోని పాత పోస్టాఫీస్ ప్రాంతంలో వీధి లైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. మున్సిపల్ సిబ్బంది ఎవరూ పట్టించుకోకపోవడంతో చీకట్లలో మగ్గుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దుకాణంలో చోరీ



ఇనుప రేకును కత్తిరించిన దొంగలు

మడకశిర: పట్టణంలోని పెనుకొండ రోడ్డు చౌటిపల్లిలో ఓ కిరాణా దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పెనుకొండ రోడ్డు చౌటిపల్లి బీసీ కాలనీలో రాజ్ కుమార్ అనే వ్యాపారి కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మంగళవారం అర్ధరాత్రి తర్వాత దొంగలు రేకులు కత్తిరించి రూ.3 వేల నగదుతో పాటు కిరాణా కొట్టులో గల దాదాపు రూ.3 వేలు విలువ చేసే సరుకులను దొంగిలించినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మేమేం పాపం చేశాం?!



గంగమ్మ పరిస్థితిని నేరుగా ఎంపీడీఓకు చూపుతున్న కుటుంబ సభ్యులు

హిందూపురం: మండలంలోని మలుగూరుకు చెందిన గంగమ్మ పక్షవాతంతో పూర్తిగా మంచానికి పరిమితమైంది. రూ.15 వేల పింఛన్ వచ్చేది. ఆమె పింఛన్ కూడా రద్దు చేయడంతో ఆమె కుటుంబ సభ్యులు బుధవారం ఆమెను ఆటోలో తీసుకొని వచ్చి ఎంపీడీఓ ఆఫీసులో పడుకోబెట్టి ఎంపీడీఓ సరస్వతికి చూపించారు. మరికొందరు తమ పరిస్థితి చూడాలని వికలాంగత్వాన్ని చూపించారు. తిరిగి పింఛన్లు పునరుద్ధరించాలని వినతి పత్రాలు అందించారు.



పెనుకొండ: ఎంపీడీఓ కార్యాలయం వద్ద దివ్యాంగులతో కలసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దివ్యాంగులకు పింఛన్ టెన్షన్ పట్టుకుంది. గత నాలుగైదు రోజులుగా ప్రభుత్వాధికారులు నోటీసులు జారీ చేస్తుండటంతో పింఛన్‌దారులంతా బెంబేలెత్తిపోతున్నారు. ఇకపై తమకు పింఛన్ వస్తుందో.. రాదోనని ఆందోళన చెందుతున్నారు. అర్హత నిరూపించుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మరికొందరు తామేమన్యాయం చేశామంటూ నిరసనలకు దిగుతున్నారు.

- పింఛన్ల తొలగింపుపై లబ్ధిదారుల గగ్గోలు
- అర్హత నిరూపించుకునేందుకు దివ్యాంగుల అవస్థలు
- పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిరసనలు

పెనుకొండ రూరల్: కూటమి ప్రభుత్వం తాజాగా పింఛన్లను తొలగించడంపై సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఏక కాలంలో మండల వ్యాప్తంగా 193 పింఛన్లు అధికారులు తొలగించారన్నారు. పుట్టుకతో అంగవైకల్యం ఉన్నవారికి కూడా పింఛన్ తొలగించడం సరికాదన్నారు. అర్హులకు పరీక్షలు నిర్వహించి తొలగించిన ఫించన్ల పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ నరేష్‌కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి హరి, మండల కన్వీనర్ బాబావలి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను ప్రశ్నించిన బాధితులు

హిందూపురం: పింఛన్లు తొలగించడంపై లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. బుధవారం హిందూపురం మండల పరిషత్ కార్యాలయానికి దివ్యాంగులు తరలివచ్చి ఇష్టానుసారంగా పింఛన్లను తొలగిస్తే తమ పరిస్థితేంటని హిందూపురం ఎంపీడీఓ సరస్వతని నిలదీశారు. కొందరికి రూ.15 వేల నుంచి రూ.6 వేలకు పింఛన్ తగ్గిస్తున్నారని, మరికొందరికి ఏకంగా పింఛన్ తొలగిస్తున్నారన్నారు. హిందూపురం మండలంలో 7606 పింఛన్లు ఉండగా 767 వికలాంగ పింఛన్లు ఉన్నాయి. వాటిలో 142 పింఛన్లు రద్దు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

గుడిబండ: పింఛన్లను తొలగింపుకు నిరసనగా లబ్ధిదారులందరూ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 112 మంది దివ్యాంగులకు పింఛన్లను రద్దు చేస్తూ సచివాలయ సిబ్బంది నోటీసులిచ్చారు. దీంతో బుధవారం వారంతా ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, స్థానిక సర్పంచ్ కరుణాకర్‌గౌడు, నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడం కూటమి ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రీవెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల జీవితాల్లో ఆడుకోవడం సరికాదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజునాయక్‌కు అందించారు.

పెనుకొండ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పలువురు దివ్యాంగులు కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. మండలంలో 193 దివ్యాంగ పింఛన్లు రద్దు కాగా, మున్సిపల్ పరిధిలో 53 పింఛన్లు ఉన్నాయి. తమకు న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చిన దివ్యాంగులు బుధవారం అర్జీలు సమర్పించారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంత మోసం చేస్తుందని అనుకోలేదని, నడవలేని స్థితిలో ఉన్న తమకు ఇలా ఇబ్బందుల పాలు చేయడం తగదన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని సాకమ్మ, భాగ్యమ్మ, భాస్కర్, రామాంజినమ్మ, నవనీత్‌కుమార్ తదితరులు వాపోయారు.

అమరాపురం: అర్హులమైనా తమ పింఛన్లను తొలగించారంటూ దివ్యాంగులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సచివాలయం సిబ్బంది ఇచ్చిన నోటీసులతో బుధవారం నిరసన తెలిపారు. గత 14 నెలల నుంచి పింఛన్లు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అనర్హులంటూ తొలగించడం అన్యాయమని భువనచంద్ర, రేణుక, నాగరాజు, రఫిక్, మహబూబ్‌భాష, విశాల, మంజునాథ తదితరులు వాపోయారు.

పింఛన్లు తొలగించడం దారుణం

మండలంలో దివ్యాంగుల పింఛన్లను పెద్ద ఎత్తున తొలగించడం అన్యాయమని ఎంపీపీ ఈరన్న విమర్శించారు. గత 2009, 2014వ సంవత్సరంలో దివ్యాంగ పింఛన్లు మంజూరయ్యాయని, వాటిని అప్పటి ప్రభుత్వాలు సదరం క్యాంపులో పరీక్షలు నిర్వహించి దివ్యాంగులుగా గుర్తించి వారికి సర్టిఫికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. పింఛన్‌దారులపై కరుణ చూపాల్సిందిపోయి కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదన్నారు. మండలంలో 182 పింఛన్లను రద్దు చేయడం బాధాకరమన్నారు.

నోటీసులను రద్దు చేయాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



నాయకులతో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నవారికి అన్ని రకాల పింఛన్లు మంజూరు చేసి కొండంత భరోసా కల్పిస్తే కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న పింఛన్ తొలగించేందుకు చర్యలు తీసుకుని వారి కడుపు కొట్టే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప మండిపడ్డారు. పింఛన్లు తొలగించే ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన టీడీపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగనాథ్ నూతనంగా నిర్మించిన గృహా ప్రవేశానికి హాజరైన సందర్భంగా నాయకులు పింఛన్ తొలగింపు విషయాన్ని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ కొత్త ఫించన్లు మంజూరు చేయకపోగా ఉన్న పింఛన్లను తొలగించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నోటీసులను రద్దు చేసి యథావిధిగా లబ్ధిదారులకు పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. మడకశిర నియోజకవర్గంలో దాదాపు 450 మందికిపైగా పింఛన్‌దారులకు నోటీసులు ఇచ్చారన్నారు. పింఛన్ల తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోకపోతే పింఛన్‌దారులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, తాలుకా, మండల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



పెనుకొండ మున్సిపల్ కార్యాలయం వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్న దివ్యాంగులు



గుడిబండ: ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు వినతిపత్రమిస్తున్న దివ్యాంగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



అమరాపురం ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

స్థలాలు చూపి.. పట్టాలు ఇవ్వండి



జాతీయ రహదారిలో రాస్తోరోకో చేస్తున్న ప్రజలు

లేపాక్షి: ఇంటి స్థలాలు చూపించి.. ఇంటి పట్టాలు మంజూరు చేసిన తర్వాతనే రోడ్డు సర్వే చేయాలని, అంతవరకు సర్వే నిలిపి వేయాలని సర్వేకు వచ్చిన అధికారులపై బిసలమానేపల్లికి చెందిన గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బిసలమానేపల్లి జాతీయ రహదారి నుంచి సి.వెంకటాపురంకు వెళ్లే రహదారిలో రోడ్డు వెడల్పులో భాగంగా 22 మంది ఇళ్లు పోతాయని నాలుగు సంవత్సరాల క్రితం అధికారులు సర్వే చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించింది. అయితే ఇళ్లు కోల్పోతున్న వారికి స్థలాలు చూపించలేదు. ఇంటి పట్టాలు మంజూరు చేయలేదు. దీంతో బుధవారం వెంకటాపురం రోడ్డును వెడల్పు చేయడం కోసం అధికారులు సర్వే చేస్తుండగా ఇళ్లు కోల్పోతున్న వారు సర్వేను అడ్డుకున్నారు. అనంతరం అధికారులపై ఆగ్రహించి నిరసన వ్యక్తం చేశారు. బిసలమానేపల్లి జాతీయ రహదారిలో బైఠాయించి తమకు న్యాయం చేయాలని రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మితో పాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నష్ట పరిహారాన్ని ఖాతాల్లోకి జమ చేశామని, ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని తెలపగా వారు తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగారు. మీకు ఏమైనా న్యాయం జరగాలంటే కార్యాలయానికి వచ్చి మీ సమస్యలు చెప్పుకోవాలని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని చెప్పడంతో రాస్తోరోకోను విరమించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

రొద్దం: ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన విధంగానే ఉద్యోగులకు కూడా రావాల్సిన బకాయిలు చెల్లించాలి. వెంటనే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ డిమాండ్‌చేశారు. బుధవారం మండలంలోని పెద్దమంతూరు, కలిపి, పి.రొప్పాల, చోళేమర్రి, నల్లూరు, రొద్దం, తదితర పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, సత్యనారాయణరెడ్డి, విష్ణు, ముజఫర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

‘పురం’లో 9 రోజుల గణపతి పండుగ

- సెప్టెంబర్ 4న నిమజ్జనోత్సవం



మాట్లాడుతున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

హిందూపురం: పట్టణంలో ఈఏడాది వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండపాలలో తొమ్మిది రోజులు ఉత్సవాలు నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి సభ్యులు నిర్ణయించారు. బుధవారం సాయంత్రం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక సుగురు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం జరిగింది. పట్టణంలోని 178 గణేష్ మండపాలు సంబంధించిన కమిటీ సభ్యులతో ఉత్సవ సమితి సభ్యులు పండుగ నిర్వాహణపై చర్చించారు. సెప్టెంబరు 4న నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. 9 రోజులు మండపాల నిర్వహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమజ్జనం రోజు పాటించవల్సిన నియమాలు, సూచనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో గంధం వేడుక



గంధం మోసుకెళ్తున్న పీఠాధిపతి



ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని

పెనుకొండ: పట్టణ సమీపంలోని హజ్రత్ సయ్యద్ షా బెహలూల్‌షా ఖాద్రీ దర్గాలో స్వామి వారి 828వ గంధం వేడుకలు బుధవారం అర్ధరాత్రి ఘనంగా జరిగాయి. దర్గా పీఠాధిపతి ఆదోని షేక్షావలి ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా వెళ్లి స్వామి వారికి సమర్పించారు. పూలచాదర్‌తో పాటు గలాఫ్‌ను స్వామి సమాధి వద్ద ఉంచి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పక్కీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, ఏజీపీ భాస్కరరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

హిందూపురం టౌన్: హిందూపురం ప్రోహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని వేలంలో పాల్గొనాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర: నియోజకవర్గంలోని అగళి, అమరాపురం, రొళ్ల, గుడిబండ మండలాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం - జంబులబండ మధ్య ఉన్న 132 కేవీ లైన్‌లో డాంపర్లు అమర్చనున్న నేపథ్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

నేడు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన

మడకశిర: పట్టణంలోని చైతన్య మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాంప్ ప్రోగ్రాంలో భాగంగా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపుతో పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్యాసింజర్ రైలు గుంతకల్లు వరకూ పొడిగించాలి

హిందూపురం: బెంగళూరు నుంచి అనంతపురం వరకే నడుస్తున్న ప్యాసింజర్ రైలు (06157/06158)ను గుంతకల్లు వరకూ పొడిగించాలని రైల్వే జీఎంను కోరినట్లు ఎంపీ పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బెంగళూరు నుంచి అనంతపురం వరకూ నడుస్తున్న ప్యాసింజర్ రైలులో అడుగు పెట్టడానికి వీలు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, ఇతర రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు రైల్వే జీఎంకు విన్నవించామని, త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి పేర్కొన్నారు. 20 నుంచి 26 వరకూ ఇంటర్‌మీడియట్ పాసైన విద్యార్థినులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 24 నుంచి 28 వరకూ ఇచ్చుకోవచ్చన్నారు. సీట్ల కేటాయింపు 31న తెలియజేస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు కళాశాల పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సంప్రదించవచ్చని చెప్పారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

చిలమత్తూరు: గ్రామాల్లో గణేష్ విగ్రహాలను మండపాల్లో కొలువుదీర్చేందుకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ మునీర్ అహ్మద్ పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంలో విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం తదితర వివరాలు పొందుపరచాలని సూచించారు. రాత్రి పది గంటల తర్వాత ఎలాంటి మైకలను వినియోగించకూడదన్నారు. నిమజ్జనం రోజు నియమాలను పాటించాలని, పోలీసులు సూచించిన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త సమాచారం

సజావుగా బహిరంగ వేలం

పావగడ: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన కొత్త బస్టాండులోని 15 షీట్ల వాణిజ్య దుకాణాలు, మరో 2 దుకాణాల 4వ దశ బహిరంగ వేలం ప్రక్రియ సజావుగా సాగింది. మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్ కుమార్ మాట్లాడుతూ ఈ వేలంతో మున్సిపాలిటీకి రూ 1.13 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

ఘనంగా దేవరాజ అరసు జయంతి

పావగడ: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి దేవరాజ అరసు జయంతి వేడుకలు స్థానిక తాలూకా కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. తహసీల్దార్ వరదరాజు దేవరాజ అరసు చిత్ర పటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే ప్లాస్టిక్ నిషేధం



ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న పూల వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో ప్రజారోగ్యం కోసమే ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలోని పలు దుకాణాలు, హోటళ్లు, కూరగాయలు, పూల వ్యాపారాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ బ్యాగులు ఉపయోగిస్తున్న వ్యాపారులకు జరిమానా విధించారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

హిందూపురం: సంతేబిదనూరు జిల్లా ఉన్నత పాఠశాలలో బుధవారం ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైతన్య సంస్థ ఆధ్వర్యంలో ఐఈసీ క్యాంపైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. అవగాహనతోనే హెచ్ఐవీని నియంత్రించవచ్చన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న దుకాణాలు తొలగించండి

రొద్దం: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపాన బూచర్లకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు. బూచర్ల, కసుమర, నాగిరెడ్డిపల్లి, ఆర్ కుర్లపల్లి, నారనాగేపల్లి, రాచూరు తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మలుపులో దుకాణాలు రోడ్డుపై ఏర్పాటు చేసుకోవడంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కులప్ప యాదవ్ ఈఓఆర్డీని కోరారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.6,400 కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాగి పంట పరిశీలన

సోమందేపల్లి: మంలంలోని నల్లగొండ్రాయనపల్లి గ్రామంలో రైతు భాస్కర్‌కు చెందిన రాగి పంటను శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య బుధవారం పరిశీలించారు. పంటకు తెగుళ్ల సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఏడీ కృష్ణ మీనన్, ఏఓ విజయ భారతి, ఏఈఓ అలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం గ్రామ పంచాయితీ పరిధిలోని రాగిమాకులపల్లి గ్రామంలో బుధవారం కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు భాస్కరరెడ్డి, శ్రీనివాస ఆచారి రైతులు సాగు చేసిన వేరుశనగ, , మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఎంఈఓలు1, 2 భాస్కర్, నరసింహామూర్తి సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికతో పాటు పాఠశాలకు మంజూరైన నిధుల రికార్డులను పరిశీలించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఔత్సాహికులతో సమావేశం

పెనుకొండ రూరల్: నూతన బార్ పాలసీలో భాగంగా ఔత్సాహికులతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని పరిశీలించారు. నూతనంగా నగర పంచాయతీకి ప్రభుత్వం బార్ కేటాయించింది. పాలసీలోని పలు అంశాలపై ఔత్సాహికులు ఎక్సైజ్ అధికారులను సంప్రదించారు. డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఔత్సాహుకులతో సమావేశమై వారి అనుమానాలను నివృత్తి చేశారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

గోరంట్ల: ఎన్నో అనర్థాలకు డ్రగ్స్ కారణమవుతోందని, అందుకే డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని ఈగల్ నోడలాఫీసర్ గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోరంట్లలోని ఎస్ఏపీఎస్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వచ్చే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ శ్రీహరి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.